సీనియర్ నటుడు ఢిల్లీ గణేష్ అస్తమయం

- క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్‌గా రాణింపు
- నేడు అంత్యక్రియలు
- మోదీ, స్టాలిన్ సహా సినీ ప్రముఖుల సంతాపం

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ నటుడు ఢిల్లీ గణేశ్ (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు వయోభారంతో బాధపడుతున్న ఆయన రామాపురంలోని తన నివాసంలో శనివారం రాత్రి కన్నుమూసినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. వివిధ భాషలకు చెందిన 400లకు పైగా చిత్రాల్లో నటించిన ఆయన దర్శక దిగ్గజం కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'పట్టిన ప్రవేశం' అనే చిత్రం ద్వారా తొలిసారి వెండితెరకు పరిచయమయ్యారు. అంతకుముందు ఆయన ఢిల్లీలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేసేవారు. సినిమాపై ఉన్న ప్రేమ, నటనపై ఉన్న ఆసక్తితో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. క్యారెక్టర్, కామెడీ, విలన్ ఇలా ఆయన వేసిన ప్రతి పాత్రలోనూ ప్రేక్షకులను మెప్పించారు. అనేక టీవీ సీరియల్స్, లఘు చిత్రాల్లో నటించారు. సామాజిక బాధ్యతలో భాగంగా, ప్రజలల్లో అవగాహన కల్పించే అనేక ప్రచార ప్రకటనల్లో నటించారు. ఆయన మృతిపట్ల తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

సీఎం, సినీ ప్రముఖులు సంతాపం...

ఢిల్లీ గణేశ్ మృతిపట్ల తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నడిగర్ సంఘం నిర్వాహకులు ఢిల్లీ గణేశ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హీరో కార్తీ తండ్రి శివకుమార్, సీనియర్ నటుడు సత్యరాజ్, ఇంకా అనేక మంది సినీ నటులు ఢిల్లీ గణేశ్ పార్థివదేహానికి అంజలి ఘటించారు. కాగా, ఢిల్లీ గణేశ్ మృతిపై సీఎం స్టాలిన్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్ చేశారు. వెండితెరపైనే కాకుండా బుల్లితెరపై కూడా రాణించిన ఢిల్లీ గణేశ్ ఇకలేరన్న వార్త జీర్ణించుకోలేమన్నారు. ఆయన మృతికి తన సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం తెలిపారు. అగ్ర నటులు కమల్ హాసన్, విజయ్, శివకార్తికేయన్, దర్శకుడు శంకర్, విక్రమన్ తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.


గణేశ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

సినీ ప్రయాణం..

1944 అగస్టు 1న తిరునల్వేలిలో జన్మించిన ఢిల్లీ గణేశ్ అసలు పేరు గణేశన్ మహదేవన్. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'పట్టిన ప్రవేశం'తో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్, విజయకాంత్, సత్యరాజ్, ప్రభు, విజయ్, అజిత్, విశాల్ ఇలా అగ్రహీరోల నుంచి యంగ్ హీరోల చిత్రాల్లో నటించారు. అనేక చిత్రాల్లో ఆయన క్యారెక్టర్ ఆర్టిస్టుగానే నటించారు. ఒకటీ రెండు చిత్రాల్లో హీరోగా, పలు చిత్రాల్లో హాస్య నటుడిగా, కొన్ని చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించారు. ముఖ్యంగా విశ్వనటుడు కమల్ హాసన్ నటించే చిత్రాల్లో ఢిల్లీ గణేశ్‌కు పాత్ర ఉండాల్సిందే. 'అపూర్వ సహోదరగల్'లో నగేష్ మెయిన్ విలన్‌గా, ఢిల్లీ గణేశ్ విలన్‌గా నటించారు. 'అవ్వైషణ్ముఖి' చిత్రంలో మీనా తండ్రిగా ప్రధాన పాత్ర పోషించారు. నాయగన్' చిత్రంలో. ధారావి ప్రాంతంలో అయ్యర్‌గా, వేలునాయకర్‌తో కలిసి చేసే ప్రయాణం ఏ ఒక్కరూ మరిచిపోలేరు. సురేష్ కృష్ణ దర్శకత్వం వహించిన 'ఆహా' చిత్రంలో వంటమనిషి పాత్రకు ప్రాణం పోశారు. బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచి ప్రారంభమైన ఢిల్లీ గణేశ్ సినీ ప్రయాణం... 'ఇండియన్-2'తో ముగిసింది. ఇదే ఆయన చివరి చిత్రం. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని 'కలైమామణి' పురస్కారంతో సత్కరించింది.

చిరంజీవికి డబ్బింగ్...

ఢిల్లీ గణేశ్ నటుడిగానే కాకుండా, డబ్బింగ్ ఆర్టిస్టుగా కూడా రాణించారు. పలువురు తమిళ నటులకు మాత్రమే కాకుండా, మెగాస్టార్ చిరంజీవి, కన్నడ నటుడు విష్ణువర్ధన్‌కు ఆయన డబ్బింగ్ చెప్పారు. 1981లో తమిళంలో కె.బాలచందర్ దర్శకత్వంలో చిరంజీవి నటించిన '47 నాట్కల్', 1990లో చిరంజీవి తెలుగులో నటించి ఘన విజయం సాధించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' తమిళ వెర్షన్ 'కాదల్ దేవదై' చిత్రానికి డబ్బింగ్ చెప్పారు. అలాగే, విష్ణువర్ధన్ నటించి 1980లో విడుదలైన 'మళలై పట్టాలం' చిత్రానికి ఆయన డబ్బింగ్ చెప్పారు.



ఢిల్లీ గణేశ్ మృతిపై ప్రధాని సంతాపం

సీనియర్ నటుడు ఢిల్లీ గణేశ్ మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'ఢిల్లీ గణేశ్ మృతి వార్త ఎంతగానో బాధించింది. అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించారు. ప్రతి పాత్రకు వన్నె తెచ్చారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ప్రతి తరం ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు. నాటక రంగంపై ఎంతో మక్కువ, అభిరుచి కలిగిన నటుడు. కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఓం శాంతి' అంటూ పేర్కొన్నారు.

శతాభిషేక వేడుకలు చేశాం : మహా గణేశ్

తన తండ్రి మృతిపై ఢిల్లీ గణేశ్ కుమారుడు, సినీ నటుడు మహా గణేశ్ మాట్లాడుతూ, 'నాన్నకు 80 యేళ్ళు ఇటీవలే శతాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించాం. ఆరోగ్యంగానే ఉన్నారు. వయోభారం కారణంగా చిన్న అనారోగ్య సమస్యలున్నాయి. శనివారం కూడా అక్కతో బాగానే మాట్లాడారు. టాబ్లెట్ ఇచ్చేందుకు నాన్నను లేపేందుకు ప్రయత్నించగా, ఎలాంటి చలనం లేదు. వెంటనే వైద్యుడు వచ్చి చూసి, అప్పటికే చనిపోయినట్టు చెప్పారు. ఆయన పార్థివదేహానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తాం' అని తెలిపారు.

అభివృద్ధే మా ప్రధాన అజెండా

- విరుదునగర్ అంటే గుర్తుకొచ్చేది కామరాజర్ ● ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే డీఎంకే ప్రభుత్వ ప్రధాన అజెండా అని, అందుకే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలిపేలా పథకాలు ప్రవేశపెడుతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. విరుదునగర్‌లో రెండు రోజులు పర్యటించి పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం స్టాలిన్, ఆదివారం రూ.77.11 కోట్లతో ఆరంతస్తులతో నిర్మించిన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టంపుదూర్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.417 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... ద్రావిడ మోడల్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందేలా పథకాలు అమలుచేస్తోందని, ఆ రీతిలో విరుదునగర్ జిల్లాలో మూడేళ్లలో అమలుపరచిన పథకాలన్నీ విజయవంతంగా కొనసాగుతున్నాయని తన పరిశీలనలో వెల్లడైందన్నారు. ఇందులో 1,887 గ్రామాలకు సంయుక్త తాగునీటి పథకాన్ని త్వరలో అమలుపరచనున్నట్లు ప్రకటించారు. శ్రీవిల్లిపుత్తూర్‌లో కొత్త బస్టాండ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. విరుదునగర్ జిల్లాలో రెండు రోజుల పర్యటన సంతృప్తికరంగా ఉందని, విరుదునగర్ అనగానే అందరికి దివంగత ముఖ్యమంత్రి కామరాజర్ గుర్తుకొస్తారని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు.


కొత్త పథకాలను ప్రారంభిస్తున్న సీఎం

సంక్షేమ పథకాలకు కరుణానిధి పేరే కరెక్ట్...

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి పేరు పెట్టడాన్ని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి విమర్శించడం సరికాదని, పథకాలకు పేరు ఎంపిక చేసే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. శ్రీవిల్లిపుత్తూర్‌లో ఆండాళ్ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం వసతులు మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో సుమారు 40వేల మందికి ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి స్టాలిన్ పంపిణీ చేశారు. తమిళ భాష, తమిళ సంస్కృతి కోసం కలైంజర్ కరుణానిధి 80 ఏళ్ల అలుపెరగక శ్రమించారని, అందువల్లే ప్రజా పథకాలకు ఆయన పేరు ఎంపిక చేస్తున్నామని చెప్పారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పదవి కోసం బొద్దింకల్లా వ్యవహరించిన మీలాంటి వారి పేరు సంక్షేమ పథకాలకు పెట్టమంటారా అని పళనిస్వామిని సీఎం సూటిగా ప్రశ్నించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌కు మరింత ఘనత చేకూర్చేలా ఆయన స్మారక మండపం, పలు ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు, ఆయన వద్ద పనిచేసిన సహాయకులకు ప్రభుత్వ కోటాలో ఇళ్ల కేటాయింపు, కామరాజర్ సోదరి నాగమ్మాళ్‌కు ఆర్థికసాయం, స్వదేశీ విమానాశ్రయానికి కామరాజర్ పేరు పెట్టామని, అంతేకాకుండా, ఆయన పుట్టినరోజును విద్య అభివృద్ధి దినంగా ప్రభుత్వం తరపున ఘనంగా జరుపుకుంటున్నట్లు సీఎం స్టాలిన్ తెలిపారు.

కార్మికుల పిల్లల విద్య ఖర్చు ప్రభుత్వానిదే...

బాణసంచా కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తెలుసుకున్నానని, ఈ కర్మాగారాల్లో సంభవించే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే కార్మికుల పిల్లల ఉన్నత విద్య ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని సీఎం స్టాలిన్ తెలిపారు. జిల్లాస్థాయిలో ఈ పథకాన్ని అమలుపరిచేందుకు వీలుగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటుచేసి తొలివిడతగా రూ.5 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రూ.21 కోట్లతో కల్వర్టుల పునరుద్ధరణ...

వ్యవసాయంలో కూడా రాణిస్తున్న విరుదునగర్ జిల్లాలోని కార్యాపట్టి, తిరుచ్చులి ప్రాంతాల్లో కల్వర్టులను రూ.17 కోట్లతో పునరుద్ధరించడంతో పాటు ఈ ప్రాంతంలోని కళింగదేవి, వెంబకోట, ఆనైకుట్టం, గొల్లవారిపట్టి డ్యాంలను రూ.23.30 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, డ్యాంలను సందర్శించే వారి కోసం రూ.2.73 కోట్లతో పర్యాటక పార్కులు కూడా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. అరుప్పుకోట సమీపంలో 400 ఎకరాల్లో రూ.350 కోట్లతో కొత్త పారిశ్రామికవాడ ఏర్పాటుచేసి, 10వేల మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సీఎం తెలిపారు. శివకాశి కార్పొరేషన్ పరిధిలో రూ.15 కోట్లతో ఆడిటోరియం, రూ.24.50 కోట్లతో రోడ్లు, సాత్తూర్‌లో రూ.2 కోట్లతో కొత్త పార్కులు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిభావంతులకే అవకాశం...

రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగబోయే ఎన్నికల్లో ప్రతిభావంతులకే పోటీచేసే అవకాశం ఉంటుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం చేశారు. విరుదునగర్ జిల్లా డీఎంకే నిర్వాహకులతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయని, ఎన్నికల్లో డీఎంకే తరపున ప్రచార వ్యూహం, పోలింగ్ కేంద్రాల్లో పార్టీ ఓటింగ్ శాతం పెంచడం, బూత్ కమిటీల పనితీరు, బహిరంగ సభల్లో ప్రసంగించాల్సిన అంశాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. డీఎంకే ప్రభుత్వంలో లబ్ధిపొందుతున్న కుటుంబాల గురించి ప్రజలకు తెలియజేయాలని, ఈ అంశాలతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న 234 నియోజకవర్గాల్లో 200 నియోజకవర్గాల్లో విజయం సాధించాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరు కఠినంగా శ్రమించాల్సి ఉందని, అభ్యర్థుల ఎంపిక పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, ఎన్నికల్లో ప్రజాదరణ కలిగిన వారికే పోటీచేసే అవకాశముంటుందని, ముఖ్యంగా, ప్రతిభావంతులను అసెంబ్లీకి పంపాల్సిన బాధ్యత తమకుందని సీఎం స్టాలిన్ తెలిపారు. సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు ఏవీ వేలు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, సీవీ గణేశన్, ఎంపీలు మాణిక్యం ఠాగూర్, నవాజ్ ఘనీ, రాణి శ్రీకుమార్, ఎమ్మెల్యేలు శ్రీనివాసన్, తంగపాండ్యన్, రఘురామన్, రెవెన్యూ నిర్వాహక కమిషనర్ రాజేష్ లఖాని, విరుదునగర్ కలెక్టర్ జయశీలన్ సహా స్థానిక సంస్థల ప్రతినిధులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


విరుదునగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించి, వసతులు పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

తాగునీటి మీటర్లు వచ్చేస్తున్నాయ్ ..!

- పరిశీలిస్తున్న వాటర్ బోర్డు



చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్లులాగే తాగునీటి మీటర్ల ఏర్పాటు చేయనున్నట్లు వాటర్ బోర్డు అధికారులు తెలిపారు. నగరంలో గృహ, వాణిజ్య అవసరాలకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు నీరు సరఫరా చేస్తోంది. నీరు ఎవరు ఏ స్థాయిలో వినియోగించినా ఒకే చార్జీ వసూలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, నగర జనాభా పెరగడం, విస్తరణ తదితరాలతో నీటి వినియోగం కూడా పెరుగుతోంది. ఈ క్రమంలో, వినియోగిస్తున్న నీటిని కూడా గణించి చార్జీ వసూలు చేయాలని మెట్రోవాటర్ బోర్డు నిర్ణయించింది.

పెరిగిన నీటి వినియోగం...

2002లో చెన్నై మెట్రోవాటర్ బోర్డు 7.7 లక్షల భవనాలకు ప్రతిరోజూ 800 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తోంది. 2024లో 7.9 లక్షల గృహాలకు అదనంగా 300 మిలియన్ లీటర్లు అందజేస్తోంది. వీటిలో 80 శాతం కనెక్షన్లున్నవారు అధికంగా నీరు వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2022-23వ ఆర్థిక సంవత్సర నివేదిక ప్రకారం, ఖర్చులు పెరగడంతో మెట్రోవాటర్ బోర్డు రూ.45 కోట్ల లోటు చవిచూసింది. దీంతో, నీటి వినియోగానికి మీటర్లు ఏర్పాటుచేస్తే ఆదాయంతో పాటు ప్రజలకు నీటి వినియోగంపై పొదుపు ఆవశ్యకత కూడా తెలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. 2026 డిసెంబరులోగా ఈ విధానం అమలులోకి వచ్చే అవకాశమున్నట్టు సమాచారం. ఈ విషయమై మెట్రోవాటర్ బోర్డు అధికారులు మాట్లాడుతూ... కేవలం 20 శాతం వినియోగదారులకు మీటర్లు ఏర్పాటుచేస్తే 80 శాతం ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే, నీటి వృధా కూడా అరికట్టవచ్చని తెలిపారు. సరఫరా చేస్తున్న నీరు తీసుకెళ్లే సమయంలో 25 శాతం వృధా అవుతోందన్నారు. ప్రస్తుతం ఉన్న విధానం కారణంగా శుద్ధీకరణ నుంచి సరఫరా చేస్తున్న నీటి వివరాలు లేవని, అందువల్ల 2025 మార్చిలోగా శుద్ధీకరించి సరఫరా చేస్తున్న నీటి వివరాలు తెలుసుకొనేలా రూ.45 కోట్లతో 518 మీటర్లు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. వాటికి 'ఐఓటీ సెన్సార్లు' అనుసంధానం చేయనున్నామన్నారు. అలాగే, ప్రైవేటు భాగస్వామ్యంతో లక్ష మీటర్లు ఏర్పాటుచేయనున్నామని, ఇందులో సగం మొత్తాన్ని వాటర్ బోర్డు భరిస్తుందని తెలిపారు. ఉత్తర చెన్నైలో ముఖ్యంగా పటాలం ప్రాంతంలో తాగునీటితో మురుగునీరు కలుస్తోందంటూ ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, ఆ సమస్య పరిష్కరించేలా రూ.946 కోట్లతో చేపట్టిన ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద పాత కొళాయిలు మారుస్తున్నామని తెలిపారు. మొదట నగరంలోని వాణిజ్య కనెక్షన్లు ఏర్పాటుచేయాలని, అనంతరం అన్నిరకాల కనెక్షన్లకు మీటర్లు విస్తరించనున్నట్లు మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కండి

- డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పిలుపు

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరిగే ఎన్నికలకు నేతలు, కార్యకర్తలు సిద్ధం కావాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పిలుపునిచ్చారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శుల సమావేశం ప్రేమలత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం అనంతరం ప్రేమలత మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు విజయకాంత్ మృతిచెంది ఈ నెల 28వ తేదీకి ఏడాది గడుస్తుందని, ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు ఏర్పాటుచేసి ఆయనకు నివాళులర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించామన్నారు. కల్తీ సారా వ్యాపారులను కఠినంగా శిక్షించేలా చట్టాలు చేయాలని, మద్యం దుకాణాలు శాశ్వతంగా మూసివేసి రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలుచేయాలన్నారు. ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం సత్వరం ఉపసంహించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం, ధన బలాన్ని ఎదిరించి, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను నియమించి ఎన్నికల పనులు ప్రారంభించాలని, రాష్ట్రం, రాష్ట్ర ప్రజల కోసం పాటుపడిన కెప్టెన్ విజయకాంత్ లక్ష్యాన్ని చేరుకొనేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని ప్రేమలత పిలుపునిచ్చారు.


జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమలత

నీటమునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కావేరి నదిలో స్నానాలకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీటమునిగి మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. నామక్కల్ జిల్లా పరమత్తివేలూరు సమీపం నగపాళం ప్రాంతానికి చెందిన చిన్నరాజ్ కుమారుడు వినీత్ విమల్‌రాజ్ (21) ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాల ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టి ప్రాంతానికి చెందిన చెందిన నందకుమార్ (21), నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ ఫైజుల్ రహమాన్ (21) చదువుతుండగా, వీరు ముగ్గురూ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు శనివారం వినీత్ విమల్‌రాజ్ ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనానంతరం, విమల్‌రాజ్ స్నేహితులతో కలసి కావేరి నదిలో స్నానానికి వెళ్లాడు. వారు చాలాసేపటి వరకు రాకపోవడంతో అనుమానించిన విమల్‌రాజ్ కుటుంబ సభ్యులు కావేరి నది ప్రాంతానికి వెళ్లారు. నది తీరంలో చెప్పులు, సెల్‌ఫోన్లు ఉండడాన్ని గమనించి దిగ్భ్రాంతి చెంది జడర్‌పాళయం పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పోలీసులు నదిలో గాలించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం కొంత దూరంలో బండరాళ్ల మధ్య చిక్కుకున్న విమల్‌రాజ్ మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. అలాగే, మరో రెండు గంటలు గాలించి మిగిలిన ఇద్దరి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మృతిచెందిన విద్యార్థులు (ఫైల్‌ఫోటో)

సమాచార దర్శిని

రేపటి నుంచి 'కల్చరల్ ఫెస్ట్'

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 'కల్చరల్ ఫెస్ట్' మంగళవారం నుంచి ప్రారంభం కానుందని చెన్నై కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి ప్లస్ టూ విద్యార్థులకు నిర్వహించనున్న తాలూకా స్థాయి పోటీల్లో జిల్లాలోని 2,200 ప్రభుత్వ, 2,000 ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని, ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

చిత్రలేఖనం పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చిత్రలేఖనం, శిల్పకళా ప్రదర్శన పోటీలకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసు కోవచ్చు. ఈ మేరకు కళలు, సాంస్కృతిక శాఖ విడుదల చేసిన ప్రకటనలో... లలిత కళలపై ఆసక్తి కలిగించేలా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఉత్తమ కళాఖండాలు ప్రదర్శించే 36 ఏళ్లకు పైబడిన 30 మందికి తలా రూ.20,000, 35 ఏళ్లలోపున్న కళాకారులకు రూ.10,000 చొప్పున మొత్తం 50 మందికి రూ.8 లక్షల బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఆసక్తిగల కళాకారులు https://artand culture.tn. gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

15 నుంచి సిద్ధ కోర్సులకు కౌన్సెలింగ్

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్ధ, ఆయుర్వేద, యునానీ, హోమియోపతి కోర్సుల్లో ఖాళీగా ఉన్న 308 సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ ఈ నెల 15వ తేది నిర్వహించనున్నారు. భారత వైద్యం, హోమియోపతి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో 2,310 సీట్లున్నాయి. 'నీట్' మార్కుల ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ గత నెలలో నిర్వహించగా, 308 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్ల భర్తీకి సంబంధించిన ప్రత్యేక కౌన్సెలింగ్ ఈ నెల 15న అరుంబాక్కంలోని సిద్ధ ఆస్పత్రి ప్రాంగణంలో జరుగనుంది. వివరాలకు www.tnhealth.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు.

16 నుంచి ఇటాలియన్ భాషపై శిక్షణ

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అండ్ ఇటాలియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ఇటాలియన్ భాష శిక్షణ కోర్సులు ప్రారంభం కానున్నాయి. శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువతీ యువకులు ఠీఠీఠీ.జ్ఞా ఞఞఞజ్ఞాఖఙఞఞఞజీ.ఛీౌ అనే వెబ్‌సైట్ ద్వారా పేరు నమోదుచేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 9080582082 అనే నెంబరు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో ఈ నెల 15వ తేది శుక్రవారం ఉదయం 5.40 నుంచి 16వ తేది శనివారం వేకువజామున 3.33 గంటల వరకు గిరి ప్రదక్షిణకు అనుకూలమని నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన అరుణాచలేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో 'అన్నామలై' అని భక్తులు పిలుచుకొనే కొండ చుట్టూ 14 కి.మీ మేర గిరి ప్రదక్షిణకు పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల గిరి ప్రదక్షిణకు అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

మహిళా సంఘాలకు రూ.28 కోట్లు విడుదల

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక వనరులు మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు విడుదల చేసింది. మహిళా సంఘాల ఆర్థిక అవసరాలు తీర్చేలా అర్హులైన బృందాలకు రివాల్వింగ్ నిధులను ప్రభుత్వం అందజేస్తోంది. ఆ ప్రకారం, ఆరు నెలలు పూర్తయిన స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాలకు ఒక్కో గ్రూపునకు రూ.1.50 లక్షల వరకు తక్కువ వడ్డీకి రుణం ఇస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 14 జిల్లాల్లో 1,209 స్వయం సహాయక సంఘాలకు రూ.1.81 కోట్ల రివాల్వింగ్ ఫండ్, 17 జిల్లాల్లోని 1,731 స్వయం సహాయక సంఘాలకు రూ.25.83 కోట్ల సామాజిక పెట్టుబడి నిధిని ప్రభుత్వం విడుదల చేసింది.

13 నుంచి చదురగిరి భక్తుల అనుమతి

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన చదురగిరి సుందర-చందన మహాలింగాలయం ఉంది. ఈ ఆలయంలో ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి సందర్భంగా నాలుగు రోజులు భక్తులను అనుమతిస్తుంటారు. ఆ ప్రకారం, ఐపసి నెల పౌర్ణమి (15వ తేది), ప్రదోషం (13వ తేది) నేపథ్యంలో, 13 నుంచి 16వ తేది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకొనేందుకు అనుమతించారు. నాలుగు రోజుల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. పదేళ్లలోపున్న పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు ఆలయ సందర్శనకు వెళ్లొద్దని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఒకవేళ పశ్చిమ కనుమల ప్రాంతాల్లో వర్షాలు కురిసే పక్షంలో భక్తులను అనుమతించమని అధికారు తెలిపారు.

మంత్రి సెంథిల్ బాలాజీకి కార్యకర్తల ఘనస్వాగతం



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి సెంథిల్ బాలాజీ 16 నెలల అనంతరం తొలిసారిగా కరూర్‌లో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయన డీఎంకే కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. రవాణా శాఖలో ఉద్యోగాలిప్పిస్తామి పలువురి నుంచి నగదు తీసుకున్నారనే కేసులో మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అధికారులు గత ఏడాది జూన్‌లో అరెస్ట్ చేశారు. దీంతో, ఆయన మంత్రి పదవి కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఆయన పెట్టుకున్న బెయిలు పిటిషన్లను ప్రత్యేక కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులు పలుమార్లు తోసిపుచ్చాయి. ఎట్టకేలకు ఆయన సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. మరుసటిరోజే ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో, ఆయన 16 నెలల అనంతరం తొలిసారిగా కరూర్‌లో జరిగిన పార్టీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సెంథిల్ బాలాజీ మాట్లాడుతూ.. విజన్ 2030 ప్రాజెక్ట్‌లో కరూర్ జిల్లాలో జౌళి ఉత్పత్తులు రూ.50 వేల కోట్లకు చేరుకొనేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సూర్యోదయం చూసేందుకు పోటెత్తిన పర్యాటకులు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కన్నియాకుమారికి ప్రతిరోజు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో పర్యాటకుల రాక అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామునే వందలాది మంది పర్యాటకులు త్రివేణి సంగమం, సన్ రైజ్ పాయింట్ రాక్ ప్రాంతాలకు చేరుకొని, సూర్యోదయం వీక్షించారు.



అనంతరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు, పడవలో సముద్రం మధ్య ఉన్న వివేకానంద రాక్‌ను సందర్శించారు. అలాగే, గాంధీ మండపం, కామరాజర్ స్మారక మందిరం, సునామీ స్మారక పార్క్, బీచ్ సమీపంలోని తమిళన్ పార్క్, సన్‌సెట్ పాయింట్, ప్రభుత్వ మ్యూజియం, ఎకో పార్క్ తదితర ప్రాంతాలు కూడా పర్యాటకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల రద్దీ అధికంగా ఉండడంతో పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది బీచ్ ప్రాంతాల్లో గస్తీ చేపట్టారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత తెలుసుకొనేలా ఎన్నికలు నిర్వహించారు. తిరుప్పూర్ జిల్లా పుదురామకృష్ణాపురం కార్పొరేషన్ బాలికల మహోన్నత పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి వరకు 1,127 మంది విద్యార్థినులున్నారు. వీరికి ఎన్నికల ప్రక్రియ తెలిపేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల అభివృద్ధి పార్టీ, పాఠశాల సాధన పార్టీ అని రెండు పార్టీలు ఏర్పాటుచేశారు. ఆ పార్టీకి చెందిన విద్యార్థులు నామినేషన్ వేయడం, నామినేషన్ల పరిశీలన, చిహ్నం కేటాయింపు తదితరాలు చేపట్టారు. విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేత, పార్టీ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు, విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగాయి. అనంతరం పోలైన ఓట్లను టేబుళ్లపై వేరుచేసి లెక్కింపు, విజేత ప్రకటన, ధ్రువీకరణ పత్రం అందజేత తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఆసక్తిగా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

జూనియర్ ఆర్టిస్టుకు 15 రోజుల రిమాండ్

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలో మెతాబెటామిన్ అనే మాదకద్రవ్యంతో పోలీసులకు పట్టుబడిన జూనియర్ ఆర్టిస్ట్ మీనాకు ఎగ్మూర్ న్యాయస్థానం 15 రోజుల రిమాండ్ విధించింది. అన్నాసాలై పరిధిలోని రాయపేటలో ఓ యువతి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మారువేషాల్లో రాయపేట గడియారం స్తంభం జంక్షన్‌లో నిఘావేసిన పోలీసులు, అక్కడ అనుమానాస్పదంగా సంచరించిన యువతిని అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో. మాదకద్రవ్యాలు విక్రయించిన గుట్టు రట్టయింది. ఆమె పలు సినిమాలతో పాటు టీవీ సీరియళ్ల జూనియర్ ఆర్టిస్ట్ మీనాగా నిర్ధారించారు. ఆమె వాట్సాప్ గ్రూప్ సృష్టించి, దాని ద్వారా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఆమె నుంచి 5 గ్రాముల మెతాబెటామిన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు 15 రోజులు రిమాండ్‌కు తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైమానికదళ పరీక్షల్లో నకిలీ అభ్యర్థి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడిలో ఉన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విభాగంలో నిర్వహించిన రాతపరీక్షల్లో పాల్గొన్న నకిలీ అభ్యర్థి పర్విన్‌శర్మ (25)ను అరెస్ట్ చేశారు. రెండు రోజులుగా సి గ్రేడ్ రైటర్ పోస్టులు భర్తీకి ఎల్‌డబ్ల్యుసీ, సీఎండీడీ పరీక్షలు నిర్వహించగా, పలు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు. శనివారం పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను అధికారులు తనిఖీచేయగా అందులో హరియాణాకు చెందిన పర్విన్ శర్మ హాల్‌టిక్కెట్‌లో లోపాలున్నట్లు తెలిసింది. అడిగినదానికి పొంతన లేకుండా సమాధానం చెప్పడంతో పర్విన్ శర్మను పోలీసులకు అప్పగించారు. విచారణలో అతను ఆగ్రాకు చెందిన మహేష్‌కుమార్ అనే అభ్యర్థికి బదులుగా పరీక్ష రాసేందుకు రూ.3 లక్షలు బేరమాడినట్లు తెలిసింది.

పారిశుధ్య కార్మికులకు కిరాణా సరుకులు



వేలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సమాజ సేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ కిరాణా సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కృషి ఎనలేనిదని, ఎండలు, వానల్లో ప్రజలకు ఎలంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

1,350 కుటుంబాలకు స్థలాల కేటాయింపు



లబ్దిదారులకు స్థలాలు చూపుతున్న రెవెన్యూ అధికారులు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తొరువెరుంబూర్ సమీపం తిరునెడుంగకుళం గ్రామానికి చెందిన 1,500 కుటుంబాలకు ఉచిత ఇళ్ల పట్టాలు జనవరిలో పంపిణి చేశారు. కానీ, వారికి కేటాయించిన స్థలాలు మాత్రం చూపలేదు. దీంతో, లబ్దిదారుల విజ్ఞప్తి మేరకు శనివారం లబ్దిదారులకు కేటాయించిన స్థలాలను రెవెన్యూ అధికారులు చూపించారు. తొలివిడతగా 500 మందికి స్థలాలు, వాటి సరిహద్దులు కొలిచారు. ఈ స్థలాల్లో దళితులు, ఇతర వర్గాలు, ముస్లింలకు వేర్వేరుగా కేటాయించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి తాలూకా జీజీ రావు నగర్‌లోని వాణి విద్యాలయంలో ఆదివారం వీరమామునివర్ 344వ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా తమిళ సంఘం ప్రతినిధులు వీరమామునివర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు అంద్రూస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల తమిళ ఉపాధ్యాయుడు వలయపతి, డార్లింగ్ గ్రూప్ అధ్యక్షుడు వెంకటసుబ్బు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ముఖ్యఅతిథి వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షులు, వేలూరు అంతర్జాతీయ పాఠశాల చెన్నై అధ్యక్షుడు జీవీ సెల్వం బహుమతులు అందజేశారు.

దివ్యాంగుల కోసం ఉచిత సెలూన్



సెలూన్ ప్రారంభిస్తున్న వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం

వేలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చేపల మార్కెట్ సమీపంలో ఆదివారం వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం జన్మదినం సందర్భంగా దివ్యాంగుల కోసం ఉచిత సెలూన్ ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ సెల్వం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి శరవణన్, నిర్వాహకులు శ్రీనివాసన్, న్యాయవాది మారన్, భూమినాథన్, సుందర్, శ్రీనివాసన్, సతీస్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు 70 మంది దివ్యాంగులకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వే వంతెన పనుల పరిశీలన



వేలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేవీ కుప్పం డివిజన్ లత్తేరి-తిరుమేని మధ్య చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణాలను కలెక్టర్ సుబ్బలక్ష్మి ఆదివారం పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట కేవీ కుప్పం యూనియన్ అధ్యక్షుడు రవిచంద్రన్, తహసీల్దార్ సంతోష్‌కుమార్, యూనియన్ కమిటీ సభ్యుడు జయమురుగేశన్, జిల్లా ఏపీఆర్‌ఓ నందకుమార్ తదితరులున్నారు.

హెచ్‌ఎంపి యువనేత ఓంకార్ బాలాజీ అరెస్ట్

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నక్కీరన్ సంపాదకుడు గోపాల్ నాలుక కోస్తానని బెదిరించిన హిందూ మక్కల్ కట్చి (హెచ్‌ఎంపి) యువజన విభాగం అధ్యక్షుడు ఓంకార్ బాలాజీని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 27న కోవైలో హిందూ సంస్థలను విమర్శిస్తున్న వారిని ఖండిస్తూ నిర్వహించిన ధర్నాలో ఓంకార్ బాలాజి, నక్కీరన్ గోపాల్‌ను బెదిరించేలా మాట్లాడారు. దీనిపై ఓ ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి బాలాజీని ఆదివారం అరెస్ట్ చేశారు.

దంపతుల ఆత్మహత్య

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా వల్లం ప్రాంతానికి చెందిన కుమార్ (40), మహారాణి (35) దంపతులు కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఇద్దరూ చీరతో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సెంజి పోలీసులు మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోవైలో కళాశాల విద్యార్థుల గదుల్లో పోలీసుల తనిఖీ

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో కళాశాల విద్యార్థులున్న గదుల్లో ఆదివారం ఉదయం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. కోవై జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు అధికంగా ఉన్నాయి. స్థానికులే కాకుండా పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ కళాశాలల్లో చదువుతున్నారు. పొరుగు ప్రాంతాల విద్యార్థులు కళాశాలల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుండగా, కొందరు మాత్రం బయట ప్రాంతాల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. కళాశాల విద్యార్థుల్లో అధిక శాతం మంది మాదకద్రవ్యాలకు బానిసవుతున్నట్లు, ఈ మత్తులో విద్యార్థులు తరచూ ఘర్షణలు పాల్పడుతున్నారనే సమాచారంతో పోలీసులు సంబంధిత విద్యార్థులున్న గదుల్లో తనిఖీలు చేపడుతున్నారు. సూలూరు ప్రాంతంలో గత వారం చేపట్టిన తనిఖీల్లో మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలు తీసుకొచ్చి విద్యార్థులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో శుక్రవారం రాజస్థాన్ నుంచి రైలులో తీసుకొస్తున్న నొప్పి నివారణ మాత్రలు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఇక, చెట్టిపాళయం ప్రాంతంలో ఉంటున్న విద్యార్థుల గదుల్లో కొందరు బయట వారుంటున్నారని, వారు విద్యార్థులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ కార్తికేయన్ ఉత్తర్వులతో ఏడీఎస్పీ, నలుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐల నేతృత్వంలో 450 మంది ప్రత్యేక పోలీసుల బృందం చెట్టిపాళయం, మధుక్కరై, కేకే చావడి ప్రాంతాల్లోని విద్యార్థులున్న ఇళ్లు, గదులు, అపార్ట్‌మెంట్లలో ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు జరిపారు. గదుల్లో గంజాయి, మాదకద్రవ్యాలు ఉంచారా? వారు కళాశాల విద్యార్థులేనా? వారి తల్లిదండ్రులు ఏ ఉద్యోగం చేస్తున్నారు? వారు వినియోగిస్తున్న వాహనాలు సక్రమమైన రిజిస్ట్రేషన్‌తో ఉన్నాయా? తదితర విషయాలను పోలీసులు పరిశీలించారు. విద్యార్థులు బ్యాగులు, సూట్‌కేస్‌లను తనిఖీ చేశారు. కొందరు విద్యార్థులు స్వయంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు, విలాసవంత జీవితానికి అలవాటు పడిన విద్యార్థులు మాదకద్రవ్యాల విక్రయాలతో అందిన నగదుతో బెంగళూరు సహా పలు నగరాలకు వెళ్లి జాలీగా గడుపుతున్నట్లు తెలిసింది. మరికొందరు తల్లిదండ్రులు పంపించే డబ్బుతో మాదకద్రవ్యాలు కొని వినియోగిస్తున్నారని తెలిసింది. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి విద్యార్థులను రక్షించే చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

భలే... భలే 3 సెం.మీ బుల్లి టెంకాయ

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బుల్లి టెంకాయను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలో నరిక్కుడి గ్రామానికి చెందిన రైతు కాశినాధన్ తోటలో టెంకాయ చెట్లు పెంచుతున్నాడు. కొద్దిరోజుల క్రితం ఆయన చెట్ల నుంచి టెంకాయలు కోసి ఇంట్లో ఉంచాడు. శనివారం ఆ టెంకాయల పీచు తీయించగా వాటిలో ఓ పెద్ద టెంకాయపై ఓ బుల్లి టెంకాయ ఉండడం గమనించి ఆశ్చర్యపోయాడు. ఈ బుల్లి టెంకాయ సుమారు 3 సెం.మీ ఉంది. ఈ విషయమై కాశినాథన్ మాట్లాడుతూ... ఇలాంటి వినోదమైన టెంకాయ ఇంతవరకూ చూడలేదన్నారు. తనకు తెలిసినంతవరకు ఇదే అతి చిన్న టెంకాయగా ఉందన్నారు. ఈ వినోద టెంకాయను ఇంట్లోనే ఉంచుకుంటామని కాశినాథన్ తెలిపారు. కాగా, బుల్లి టెంకాయ వార్త గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్తులు కాశినాధన్ ఇంటికి చేరుకొని ఆసక్తిగా చూసి వెళుతున్నారు.



22 రోజులకు సరిపడా నేలబొగ్గు నిల్వ

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్, తూత్తుకుడి, సేలం జిల్లాల్లో విద్యుత్ బోర్డుకు 4,320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు థర్మల్ కేంద్రాలున్నాయి. తిరువళ్లూర్‌లో కొత్తగా ప్రారంభించిన 800 మెగావాట్ల ఉత్తర చెన్నై-3 థర్మల్ విద్యుత్ కేంద్రంలో వాణిజ్యపరమైన విద్యుదుత్పత్తి ఇంకా ప్రారంభం కాలేదు. ఇది మినహా మిగిలిన ఐదు థర్మల్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి ప్రతిరోజు 72,000 టన్నుల నేల బొగ్గు అవసరమవుతుండగా, ఈ బొగ్గును ఒడిశాలోని తాల్చేర్, ఐబీ వ్యాలీ తదితర గనుల నుంచి దిగుమతవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ వినియోగం తగ్గడంతో, థర్మల్ విద్యుదుత్పత్తిని 2,500 మెగావాట్లకు తగ్గించారు. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 22 రోజులకు సరిపడా 17.80 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉండగా, ప్రతిరోజు ఒడిశా నుంచి 60వేల టన్నుల నేలబొగ్గు రాష్ట్రానికి దిగుమతవుతోందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు కర్మాగారాల్లో క్షేత్రస్థాయి శిక్షణ

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వృత్తివిద్య చదివే విద్యార్థులకు, కర్మాగారాల్లో క్షేత్రస్థాయి శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు కౌన్సిల్ మెంబర్ సెక్రటరీ విన్సెంట్ విడుదల చేసిన ప్రకటనలో... కోయంబత్తూర్, తిరువళ్లూర్ సహా 16 జిల్లాల్లోని వృత్తి విద్యా చివరి సంవత్సరం విద్యార్థులకు ఈ శిక్షణ అందించనున్నామన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు స్వయం ఉపాధి పొందే అవకాశముందని తెలిపారు. బ్యాంక్ రుణాలు పొందడం, ఇంటర్వ్యూల్లో ఎలా పాల్గొనాలి అనే విషయాలపై కూడా అవగాహన కల్పించనున్నామని, ఈ ఏడాది 4,500 మంది విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఊటీ కమిషనర్ వాహనంలో రూ.11.70 లక్షలు



పట్టుబడిన నగదుతో కమిషనర్

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఊటీ కమిషనర్ తన కారులో రూ.11.70 లక్షలు తీసుకెళ్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నీలగిరి జిల్లా ఊటీ మున్సిపల్ కమిషనర్‌గా జహంగీర్ బాషా పనిచేస్తున్నారు. ఆయన శనివారం రాత్రి అద్దె కారులో సొంతూరైన చెన్నైకు రూ.11.70 లక్షలతో వెళ్తున్నట్లు ఏసీబీ అధికారులకు సమాచారం అందింది. ఏసీబీ డీఎస్పీ జయకుమార్ ఉత్తర్వుల మేరకు ఇన్స్‌పెక్టర్ ప్రమీలాదేవి, పోలీసులు ఊటీ దొడ్డబెట్ట జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కమిషనర్ కారులో తనిఖీ చేయగా, అందులో రూ.11.70 లక్షలు గుర్తించారు. విచారణలో కమిషనర్ పొంతన లేని సమాధానం ఇవ్వడంతో ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఊటీ మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా రాయపురం పరిధిలోని ఈస్ట్ కల్మండపం, వెస్ట్ కల్మండపం, ఎస్ఎన్ చెట్టి వీధి, ఎంఎస్ ఆలయ వీధి, హాస్పేన్ మేస్త్రి వీధి, షేక్ మేస్త్రీ వీధి, వెస్ట్ మాతా ఆలయ వీధి, పకీర్ సాహిబ్ వీధి, టీవీ ఆలయ వీధి, ఎస్సార్పీ రోడ్డు, ఈస్ట్ మాతా వీధి, రైల్వే ప్రెస్, ముత్యాలపేట, తంబు లైన్, మార్కెట్ లైన్, లోటస్ రామస్వామి వీధి, ఏజే కాలని, ఖాసిమా నగర్, జీవరత్నం అపార్ట్‌మెంట్స్, జీఎం పేట, న్యూ వాషర్‌మెన్‌పేట ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఆగని లంక నావికాదళం దాడులు

- 23 మంది రామేశ్వరం జాలర్ల అరెస్ట్

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం అనుమాషదాడులు కొనసాగుతున్నాయి. తాజాగా రామేశ్వరానికి చెందిన 23 మంది జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసింది. రామేశ్వరం నుంచి శనివారం జాలర్లు చేపల వేటకు వెళ్లారు. నడుదీవు సమీపంలో వారు చేపలు పడుతున్న సమయంలో, లంక నావికాదళం గస్తీ నౌకలు వారిని చుట్టుముట్టాయి. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని మూడు పడవలు సహా 23 మంది జాలర్లను అరెస్ట్ చేసి, నావికాదళం కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. కాగా, లంక నావికాదళం రాష్ట్ర జాలర్లపై చేస్తున్న అమానుషదాడులు అడ్డుకొనేలా, వారు అరెస్ట్ చేసిన జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలరి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

విమానాల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఆదివారం ఇతర నగరాలకు బయల్దేరాల్సిన నాలుగు విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆదివారం నగరానికి రావాల్సిన నాలుగు, నగరం నుంచి బయల్దేరాల్సిన ఐదు విమానాలు మొత్తం 9 సర్వీసులు రద్దు చేశారు. బెంగళూరు, కొల్‌కత్తా, ఢిల్లీ, పూనే, గౌహతి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. ఈ విమానాలకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా, నిర్వహణ కారణాల రీత్యా విమానాలు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించినా, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో విమాన సర్వీసులు రద్దు చేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ప్రజాక్షేమమే ధ్యేయంగా పథకాలు

- మంత్రి శేఖర్ బాబు

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాశ్రేయస్సు, క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి స్టాలిన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు వెల్లడించారు. డీఎంకే తూర్పు జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోయినప్పటికీ ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గిండిలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మదురైలో గ్రంథాలయం, జల్లికట్టు మైదానం ఇలా అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇలాంటి అభివృద్ధి పనులను ఎవరైనా చెబితేనే చేసేవారనీ, కానీ ఇపుడు ఎవరూ చెప్పకపోయినా ముఖ్యమంత్రి స్టాలిన్ దూరదృష్టితో ఆలోచించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.

మెట్రో సొరంగంలో లీకైన మీథేన్

- తవ్వకం పనులు నిలిపివేత

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ - శాంథోమ్ మార్గంలో జరుగుతున్న మెట్రో రైల్ సొరంగం పనుల్లో మీథేన్ వాయువు విడుదలైంది. దీంతో ఈ సొరంగం తవ్వకం పనులను గత వారం రోజులుగా అధికారులు నిలిపివేశారు. లైట్ హౌస్ నుంచి పూందమల్లి వరకు మెట్రో మార్గ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా 18 మీటర్ల లోతులో మైలాపూర్ కచ్చేరి రోడ్డు నుంచి శాంథోమ్ చర్చి వరకు సొరంగం తవ్వకం పనులు సాగుతున్నాయి. లైట్‌హౌస్ వద్ద తవ్వకం పనులు సాగుతుండగా ఒక్కసారిగా మీథేన్ వాయువు వెలువడటాన్ని గుర్తించిన ఇంజనీర్లు తవ్వకం పనులను నిలిపివేశారు. దీనిపై మెట్రో అధికారులు స్పందిస్తూ, సొరంగం తవ్వకం పనులు సాగుతుండగా వెలువడిన గ్యాస్ హానికారకం కాదని, అందువల్ల నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో వెల్లుల్లి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వెల్లుల్లి తక్కువగా వస్తుండడంతో కొద్దిరోజులుగా వాటి ధరలు పెరుగుతున్నాయి. ఆదివారం వెల్లుల్లి రూ.450 నుంచి 500 వరకు పలికింది.

'వనంగాన్' రిలీజ్ తేదీ వెల్లడిస్తాం : నిర్మాత


'వనంగాన్'లో అరుణ్ విజయ్

బాలా దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వనంగాన్'. ఈ చిత్రం విడుదలపై ఇప్పటివరకు ఒక క్లారిటీ రాలేదు. ఇప్పటికే నిర్మాణాంతర కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకోగా, ఈ నెలలో విడుదల చేస్తారనే ప్రచారం సాగింది. కానీ, విడుదల తేదీపై మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇదే విషయంపై చిత్ర నిర్మాత సురేష్ కామాక్షి వద్ద ప్రస్తావించగా 'వనంగాన్' విడుదల కోసం అనువైన సమయం, సందర్భం కోసం ఎదురు చూస్తున్నాం. త్వరలో రిలీజ్ తేదీపై ఓ క్లారిటీ ఇస్తాం' అని తెలిపారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలో రోషిణి ప్రకాష్, మిష్కిన్, సముద్రఖని తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.

వీడిన చిక్కులు - 14నే 'కంగువా' విడుదల


'కంగువా'లో సూర్య - బాబీ డియోల్

స్టూడియో గ్రీన్ బ్యానరుపై నిర్మాత జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో పదికి పైగా భాషల్లో నిర్మించిన 'కంగువా' చిత్రం విడుదలకు న్యాయపరమైన చిక్కులు వీడాయి. దీంతో ముందుగా ప్రకటించినట్టుగా ఈ నెల 14వ తేదీ విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. సిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య, బాబీ డియోల్, దిశా పటానీ, యోగిబాబు తదితరులు నటించారు. అయితే, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఆగస్టులోగా చెల్లించాల్సిన రూ.55 కోట్ల రుణం ఇంకా చెల్లించలేదని, అందువల్ల సినిమా విడుదలపై స్టే విధించాలని రిలయన్స్ సంస్థ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా, పలుదఫాలుగా విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం మరోమారు ఈ పిటిషన్ విచారణకు రాగా, ఆ సంస్థకు చెల్లించాల్సిన రుణాన్ని చెల్లించినట్టు స్టూడియో గ్రీన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో సినిమా విడుదలకు ఎలాంటి ఆటంకం లేదని న్యాయస్థానం పేర్కొంది. మరోవైపు, ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 'యూఏ' సర్టిఫికెట్ మంజూరు చేసినట్టు చిత్ర బృందం తెలిపింది.

'అమరన్' కలెక్షన్లు రూ.200కోట్లు

● జీవీకి ఎస్కే గిఫ్ట్

దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి - హీరో శివకార్తికేయన్ కాంబినేషన్‌లో రూపొందిన 'అమరన్' మూవీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పది రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్ల మేరకు కలెక్షన్లు వసూలైనట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అక్టోబరు 31న తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలైంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. అగ్రనటుడు కమల్ హాసన్, సోనీ పిక్చర్స్ నిర్మాతలు. ఈ సినిమా విడుదలైన అన్ని భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. తొలి రోజే రూ.45 కోట్లు వసూలు చేయగా పది రోజుల్లో రూ.200 కోట్లు వసూలు చేసింది. స్వదేశంలోనే రూ.122 కోట్లు వసూలు చేసినట్టు సమాచారం. మేజర్ ముకుంద్ వరదరాజన్ బయోగ్రఫీ ఆధారంగా సినిమా రూపొందించారు. ఇదిలావుంటే, ఈ చిత్రం ఘన విజయానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం కూడా ఓ కారణం. నేపథ్య సంగీతంతో పాటు ఈ చిత్రంలోని పాటలకు సూపర్‌హిట్ అయ్యాయి. ఈ నేపథ్యంలో జీవీకి హీరో శివకార్తికేయన్ ఖరీదైన వాచ్ బహూకరించారు. ఈ విషయాన్ని జీవీ ప్రకాష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "అమరన్' సినిమా విజయానికి స్వీట్ గిఫ్ట్ అందజేసినందుకు ఆయన ధన్యవాదాలు' తెలిపారు.



జీవీ ప్రకాష్‌కు ఎస్కే బహూకరించిన రిస్ట్‌వాచ్

చిత్రజ్యోతి



ఫెయిల్యూర్స్‌కు భయపడను

● పూజా హెగ్డే

తాను నటించిన చిత్రాల ఫెయిల్యూర్ గురించి అస్సలు ఆలోచన చేయనని ఏమాత్రం భయపడనని హీరోయిన్ పూజా హెగ్డే వ్యాఖ్యానించారు. 2012లో మిష్కిన్ దర్శకత్వంలో జీవా హీరోగా నటించిన 'ముగమూడి' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన ఈ భామ... ఆ తర్వాత తమిళంలో సినీ అవకాశాలు లేకపోవడంతో టాలీవుడ్‌కు వెళ్ళిపోయింది. విజయ్ నటించిన 'బీస్ట్' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చి, ఇపుడు తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా ఉంది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, 'నేను ఎంచుకునే పాత్రకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాను. కానీ, కొన్ని సందర్భాల్లో ఆ చిత్రాలు పూర్తిగా నిరాశ పరుస్తున్నాయి. ఇలాంటి ఫెయిల్యూర్స్‌ను నేను అస్సలు పట్టించుకోను. భయపడను కూడా. నేను చేస్తున్న పని సక్రమంగా చేయడంపైనే నా దృష్టంతా ఉంటుంది. ఆ కోణంలో నేను నటించే ప్రతి పాత్రకు వంద శాతం బాగా నటించేందుకు కృషి చేస్తాను. అందుకే దర్శక నిర్మాతలు వరుసగా అవకాశాలిస్తున్నారు. ఇపుడు నా చేతిలో ఐదు పెద్ద ప్రాజెక్టులు ఉండటానికి కారణం నా నటనే. నా ప్రతిభపై దర్శకులకు ఉన్న అపారమైన నమ్మకంతోనే వరుసగా అవకాశాలు ఇస్తున్నారు' అని వెల్లడించింది.

కార్డియాలజీపై ప్రత్యేక సదస్సు



కార్యక్రమంలో వైద్య నిపుణులు, ఐఏఎస్ అధికారి వీరరాఘవరావు తదితరులు

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్ కోర్సు (ఏఐసీసీ) ప్రోమ్డ్ హాస్పిటల్‌తో కలిసి ఆసియాలోనే తొలిసారిగా ప్రత్యేకమైన రెండు రోజుల సదస్సు నిర్వహిస్తోంది. చెన్నైలో జరుగుతున్న ఈ కోర్సు ఇంటర్వెన్షనల్ విధానాల్లో సంక్లిష్టతలకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రారంభోత్సవంలో ప్రముఖ కార్డియాలజిస్టులైన డాక్టర్ అరుణ్ కల్యాణసుందరం, డాక్టర్ విలియం లొంబార్డి, డాక్టర్ మసాహిసా యమనే, డాక్టర్ స్ఫూర్తి అరుణ్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరరాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ, నిబద్ధతతోనే విజయాలు

● వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ రష్మి ఓలేటి


సిల్వర్ రోలింగ్ ట్రోఫీ అందిస్తున్న రష్మి -సునీల్ దంపతులు


ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజాయితి, నిబద్ధత ఉంటే ఎంచుకున్న ఏ రంగంలోనైనా తప్పక విజయాలు సాధించవచ్చని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి 502ఏ గవర్నర్ రష్మి ఓలేటి అన్నారు. స్థానిక చెట్‌పెట్‌లోని కుచలాంబా హాలులో ఆదివారం ఓలేటి బ్లాక్ బస్టర్ ఇయర్-2024 వేడుకలతో పాటు 11వ వార్షిక జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రష్మి మాట్లాడుతూ... వ్యాపారాలు చేసే వారు, విద్యాసంస్థలు నిర్వహించేవారు నీతి, నిజాయితిగా ఉంటే ఆయా రంగాల్లో రాణించగలుగుతారన్నారు. సుమారు 40 క్లబ్‌ల నిర్వాహకులు, పీఎస్టీలు, ఐపీసీలు, సభ్యులందిస్తున్న సహకారంతో ఏడాది కాలంలో గవర్నర్‌గా సమాజానికి మరిన్ని ప్రాజెక్టులు అందించగలిగినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది ఉత్తమ సేవలందించిన క్లబ్ నిర్వాహకులు దాదాపు 500 మందికి పైగా సిల్వర్ కాయిన్‌లు, జ్ఞాపికలు, బ్లాక్ బస్టర్ అవార్డులు అందజేశారు. కొత్తగా డిజైన్ చేసిన సిల్వర్ రోలింగ్ ట్రోఫీ పరిచయం చేసి, వాసవి క్లబ్ ఎలైట్ అధ్యక్షుడు సూరిశెట్టి బాలాజీ-దివ్య టీమ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన పి.సుదర్శన్ ప్రదానం చేశారు. గౌరవ అతిథి పి.ప్రదీప్, క్లబ్ క్యాబినెట్ కార్యదర్శి ఎం.లావణ్య, క్యాబినెట్ ట్రెజరర్ అచ్చా ఆనంద్, మాజీ గవర్నర్లు సుజాత రమేష్‌బాబు, నామా సతీష్‌కుమార్, బీఎల్ కుమరవేల్-చిత్ర, డా.చంద్రగుప్త, జెమిని టింబర్ అధినేత సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ వేడుకల్లో కళాకారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అతిథులు, సత్కారం అందుకున్న క్లబ్‌ల నిర్వాహకులు సీఈఓ సునీల్ ఘనంగా సత్కరించారు.

ఘనంగా హోమియో వైద్యుల సదస్సు


వైద్యుల సదస్సులో డాక్టర్ కొల్లిరాజు, డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి తదితరులు

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదంబాక్కంలో ఆదివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ తమిళనాడు, పుదుచ్చేరి విభాగాల ఆధ్వర్యంలో హోమియో వైద్యుల సదస్సు ఘనంగా జరిగింది. ఇందులో రిటైర్డ్ హోమియోపతి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కొల్లిరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరుకు చెందిన డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి, డాక్టర్ ఎన్ఆర్.జయకుమార్, డాక్టర్ ఎం.ప్రకాష్ రావు, డాక్టర్ వెల్‌బర్ట్ దాస్ బ్రిట్టో, డాక్టర్ ఎస్.శరవణన్, డాక్టర్ ఆషా, డాక్టర్ శివ, డాక్టర్ పరాన రాధమ్మ, డాక్టర్ కొల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న 25 మంది వైద్యులు, హోమియో వైద్యం వలన కలిగే ప్రయోజనాలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కార్యకర్తలకు సోషల్ మీడియాపై శిక్షణ



● డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకే యువజన విభాగం కార్యకర్తలకు సోషల్ మీడియాపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. ఇదే విషయంపై ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు యువజన విభాగానికి చెందిన కార్యకర్తలకు సోషల్ మీడియాపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఒక్కో ప్రాంతం నుంచి ఒకరిని ఎంపిక చేసి ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 12న బోడినాయకనూరు, పెరియకుళం, 13వ తేదీన నాగపట్టణం, ఆండిపట్టి, 14వ తేదీన తెన్‌కాశి, కడయనల్లూరు ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు.


చెన్నైలో ఆదివారం ప్రారంభమైన జపాన్ సంప్రదాయం, పర్యాటకం, విద్య, ఉపాధి అవకాశాలు తెలిపే ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన సందర్శకులకు వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అరుదైన తాళ పత్ర గ్రంథాలను సేకరించడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా కాపాడుతూ, భావితరాల వారికి అందులో ఉన్న జ్ఞాన సంపదను అందిస్తున్న సిద్ధ వైద్యుడు... తాళపత్రాల్లో దాగి ఉన్న సిద్ధ వైద్య రహస్యాలను ఆకళింపు చేసుకుని హస్తవాసి కలిగిన సిద్ధ వైద్యుడిగా ఖ్యాతినొందారు కోవై జిల్లాలోని కళ్ళిపాళ్యం గ్రామానికి చెందిన జ్ఞాన సౌందిరం. సిద్ధవైద్యానికి సంబంధించిన ప్రాచీన తాళపత్రాలను వేలసంఖ్యలో సేకరించి భద్రపరుస్తున్నారు. ఆయన తాళపత్రాల కోసం అవిరళ కృషి చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి,చెన్నై


ప్రాచీన తాళపత్రాలను పరిశీలిస్తున్న సిద్ధవైద్యుడు జ్ఞానసౌందిరం

అరుదైన గ్రంథాల కోసం అవిరళ కృషి

● ఏడు పదుల వయసులో తాళపత్రాల సేకరణ
● ఐదుశతాబ్దాల నాటి చిట్కాలతో సిద్ధవైద్యం
● కోవై వైద్యుడి నిరంతరాన్వేషణ


సిద్ధవైద్య సంబంధిత ప్రాచీన తాళపత్రాలు


సిద్ధవైద్య తాళపత్రాల్లో ప్రాచీన తమిళ అక్షరాలు

తమిళభాష మూలాలకు తల్లివేరులా, కవితలకు, కావ్యాలకు, కథలకు, పురాణాలకు రాతప్రతులుగా, ప్రాచీన ప్రసారమాధ్యమంగా విరాజిల్లిన తాళపత్రాలను చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పట్టణాలకు, నగరాలకు, మారుమూల కుగ్రామాలకు సైతం వెళ్ళి సేకరించి ఉ.వే. సామినాథ అయ్యర్, మీనాక్షి సుందరం వంటి తమిళ పండితులు తమిళ సాహిత్యాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ప్రాచీన తాళపత్రాల్లో నిక్షిప్తమైన అరుదైన సమాచారాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. బంగారు, ఇత్తడి, రాగి శాసనాలు, శిలా శాసనాల కంటే ఈ తాళపత్రాలను భద్రపరచటం సవాలుతో కూడుకొన్న పని. అయితే కోయంబత్తూరు పడమటి కనుమల శ్రేణుల చేరువగా ఆలందురై సమీపంలో నొయ్యల్‌వాగును ఆనుకుని ఉన్న కళ్ళిపాళయం గ్రామానికి చెందిన 72 యేళ్ల జ్ఞానసౌందిరం తన ఇంట సుమారు 500 యేళ్లనాటి తాళపత్రాలను కంటికిరెప్పలా సంరక్షిస్తున్నారు. తాళపత్రాలను జ్ఞానసౌందిరం తాతముత్తాలు కూడా సేకరించేవారు. ఆ వరుసలో ఏడో తరానికి చెందిన జ్ఞానసౌందిరం వైద్య చిట్కాలు, భూకొలతల శాస్త్రం, శిల్పకళకు సంబంధించిన వివరాలతో కూడిన తాళపత్రాలను చదివి సిద్ధ వైద్యం చేస్తున్నారు. తమిళ సిద్ధ వైద్య మండలిలో పేరు నమోదు చేసుకుని హస్తవాసి కలిగిన సిద్ధవైద్యుడిగా పేరుపొందారు. ఇంపకాంపస్ సంస్థలో సభ్యుడిగానూ ఉన్నారు. తన అవిరళ కృషి గురించి జ్ఞానసౌందిరం ఇలా చెప్పుకొచ్చారు..

తాళపత్రాల డిజటలైజేషన్..

ఈ విషయమై రాష్ట్ర పురావస్తు పరిశోధక శాఖ తాళపత్రాల సంరక్షణ మండలి కోయంబత్తూరు ప్రాంతీయ సమన్వయకర్త అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ ఆధీనాలలో (మఠాలలో), ప్రైవేటు వ్యక్తులు భద్రపరచిన అరుదైన ప్రాచీన తాళ పత్రాలను సేకరించి వాటిని డిజటలైజేషన్ చేసి భావితరాలకు అందించే కార్యక్రమాలను ముమ్మరంచేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పేరూరు ఆధీనంలో ఉన్న 80 వేల పుటలు, సిద్ధవైద్యుడు జ్ఞానసౌందిరం వద్ద 30 వేలకు పైగా ఉన్న పుటలను డిజిటలైజేషన్ చేసినట్లు ఆయన వివరించారు. తాళపత్రం ఇరువైపు పుటలు, రాతలు, శీర్షికలు, వెడల్పు ఇలా అన్ని భాగాలున్నది ఉన్నట్లుగా డిజటలైజేషన్ చేశామని, ప్రస్తుతం అవన్నీ భావితరాలకు అందించే ప్రక్రియ కూడా జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం ఎక్కడ ప్రాచీన తాళ పత్రాలు ఉన్నా వాటిని వెదికి మరీ సేకరించి డిజటలైజేషన్ చేస్తున్నామని వివరించారు.

సిద్ధవైద్య మందుల తయారీ..

రాష్ట్ర పురావస్తు పరిశోధనశాఖ సాయంతో 350కి పైగా తాళపత్రాలను భద్రపరచి, ఆ తాళపత్రాలలో ఉన్న వివరాలన్నింటినీ తమిళ సమాజానికి అర్థమయ్యే లా వేల పుటల్లో రాతప్రతులను రాసి ఉంచాను. ప్రస్తుతం వీలుచిక్కినప్పుడల్లా తాళపత్రాలకు తమిళ వ్యాఖ్యానాలు రాస్తున్నాను. తాళపత్రాల వివరాలను చదవటం, రాయటం నా సోదరి అమరావతికి ఎంతో ఇష్టం. ఆమె సాయంతో తాళపత్రాల్లోని వివరాల ఆధారంగా సిద్ధ వైద్య మందులు తయారు చేస్తున్నాను. ఆ తాళపత్రాల్లో పేర్కొన్న చిట్కాలతో సిద్ధవైద్యం చేస్తున్నా. నా సతీమణి కళైసెల్వి, కుమారుడు సురేష్‌కూడా తాళపత్రాల్లోని వివరాలను చెబుతూ నాకు అన్ని విధాలా సాయపడుతున్నారు. ఓ పర్యాయం శ్రీలంక నుంచి తమిళ పండితులు కొందరు ప్రాచీన తమిళ తాళపత్రాలను తీసుకొచ్చి వాటిని చదివి వివరణాత్మకంగా నేటి వాడుక తమిళంలో రాసి ఇమ్మని అడిగారు. ఆ కార్యం చాలా కష్టంతో కూడుకొన్నదే అయినా తమిళభాషపై శ్రీలంక తమిళ పండితులు చూపుతున్న ఆదరణకు సంతోషించి కఠినమైన తమిళ పదాలకు సులువైన పదాలతో వివరణ రాసిచ్చాను. ఇదే విధంగా రాష్ట్రం నలుమూలల నుండి తాళపత్రాల్లో వివరాలను రాసివ్వమంటూ రోజూ ఎంతో మంది వెదుక్కుంటూ వస్తున్నారు. తాళపత్రాల్లో పలు వ్యాధులకు సిద్ధపురుషులు పేర్కొన్న వైద్య చిట్కాలను పరిశీలించి మందులు తయారు చేసి అందిస్తున్నా. రసవాద కళ, రసకట్టు వంటి ఎన్నో వైద్య సంబంధిత వివరాలు ఈ తాళపత్రాలలో నిక్షిప్తమై ఉన్నాయి. పూర్వం పంటపొలాల వద్ద, తోటల్లో సర్వసాధారణంగా లభించే మూలికలన్నీ ప్రస్తుతం వెతికి సేకరించాల్సి వస్తోంది. మునుపు సేంద్రియ సాగు చేయడం వల్ల పంట పొలాల వద్ద మూలికలు కూడా పెరుగుతుండేవి. ప్రస్తుతం ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతుండటం వల్ల విలువైన మూలికలన్నీ కనుమరుగైపోతున్నాయి.

భావితరాలకు అరుదైన సంపద అందించడమే లక్ష్యం


సిద్ధవైద్య తాళపత్రాల కోసం వివరించే గ్రంథాలు

"మా తండ్రి తిరుమూర్తి పేరున్న సిద్ధవైద్యుడు. ఆయన్ని గురువుగా స్వీకరించి తాళపత్రాల్లో వివరాలను అర్థం చేసుకుని ఆ వివరాలను గ్రంథస్థం చేయడం, వైద్యం, జ్యోతిష్యం వంటి పలు కళలను కూడా నేర్చుకున్నాను. మా తండ్రి మరణానంతరం తాళపత్రాలను సంరక్షించి, వాటిని చదివి అందులోని వివరాలను రాసి ఉంచుతున్నాను. తరచూ కళాశాలలకు వెళ్ళి తాళపత్రాల వివరాలను ఎలా చదవాలో విద్యార్థులకు బోధిస్తున్నాను. మా తండ్రి భద్రపరచిన 1512వ సంవత్సరానికి చెందిన.. అంటే సుమారు 500 యేళ్ల ప్రాచీన తాళపత్రాలు ఇప్పటికీ భద్రంగా వున్నాయి. ఆ తాళపత్రాల్లో పులిపాణి సిద్దర్, మత్స్యముని సహా పలువురు సిద్ధపురుషులు రాసిన వైద్య సంబంధిత వివరాలున్న తాళపత్రాలున్నాయి. మా ఇంట సంరక్షిస్తున్న తాళపత్రాల గురించి తెలుసుకున్న పురావస్తు పరిశోధకులు వచ్చి తాళపత్రాలను డిజిలైజేషన్ చేసుకెళుతున్నారు. అంతే కాకుండా ఆ తాళపత్రాలు చెడిపోకుండా ఉండేలా కొత్త మెరుగులు అద్దుతున్నాము.

దుస్థితిలో సిద్ధవైద్యులు..

ప్రస్తుతం ప్రాచీన సిద్ధవైద్యంపై ఆదరణ తక్కువ కావటంతో సిద్ధ వైద్యం నేర్చుకునేవారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. ఈనాటికీ సిద్ధ వైద్యం చేస్తున్నవారంతా పేదరికంలోనే ఉన్నారు. వ్యయప్రయాసలకోర్చి మూలికలు కొని మందులు తయారు చేస్తున్నారు. అరుదైన మూలికలు అందుబాటులో లేవు. వాటిని పెంచి పోషించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వమే వనమూలికల తోటలు పెంచి మూలికలను సిద్ధవైద్యులకు అందజేస్తే ప్రాణరక్షణకు అవసరమయ్యే సిద్ధవైద్య మందులను తయారు చేయలుగుతారు. నేను గురువుగా భావించిన తన తండ్రి తిరుమూర్తి జీవసమాధి ఇప్పటికీ మా గ్రామంలోనే ఉంది. మహాబలిపురంలో ఆయన విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నాం" అని జ్ఞానసౌందిరం తెలిపారు.

ప్రముఖ రచయిత ఇందిరా సౌందరరాజన్ మృతి


ఇందిరా సౌందరరాజన్ మృతి (ఫైల్‌ఫొటో)

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత ఇందిరా సౌందరరాజన్ (66) బాత్‌రూమ్‌లో జారి పడి మరణించారు. 1958 నవంబరు 13న సేలంలో పార్థసారథి, ఇందిర దంపతులకు జన్మించిన ఆయన గత 40 యేళ్ళుగా మదురైలోని టీవీఎస్ ప్రాంతంలో ఉంటున్నారు. ఈయనకు భార్య రాధ, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆరంభంలో టీవీఎస్ కంపెనీలో అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేసి తర్వాత టీవీ, చిత్రపరిశ్రమల్లో ప్రవేశించారు. ఈయన రచించిన 'మర్మకథైగల్' రచనకు పాఠకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ తర్వాత అనేక రచనలు చేసిన ఆయన ఎన్నో ఆధ్యాత్మిక ప్రవచనాలను కూడా వినిపించారు. చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి జాతీయ అవార్డు సహా అనేక అవార్డులను అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం మదురైలోని తన నివాసంలో బాత్‌రూమ్‌లో జారిపడటంతో తలకు బలమైన గాయం తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శకుల కోసం నివాసంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇందిరా సౌందరరాజన్ మృతిపట్ల నడిగర్ సంఘం సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

స్ఫూర్తి ప్రదాత 'నల్లి కుప్పుస్వామి శెట్టి'


పుస్తకావిష్కరణ దృశ్యం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ నల్లి కుప్పుస్వామి శెట్టి స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆర్ఏ పురంలోని చెట్టినాడు విద్యాశ్రంలో శనివారం సాయంత్రం కుప్పుస్వామి శెట్టి 85వ జన్మదినం సందర్భంగా ఆయన జీవితవిశేషాలతో ఆరు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. బ్రహ్మగాన సభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కస్తూరి అండ్ సన్స్ డైరెక్టర్ ఎస్.రవి అధ్యక్షత వహించగా, గోటేటి గ్రాఫిక్స్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'సహృదయ నల్లి' పుస్తకంతో పాటు 'నల్లి ది మ్యాన్ ది బ్రాండ్', 'జ్ఞానం తంద జ్ఞానానందర్', 'తేన్ గూడు', 'నల్లియల్బు నిర్వాగం', 'నల్లియుం నాగరథరుం నన్నర్గళుం' పుస్తకాలను ఆవిష్కరించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తమిళ విభాగాధిపతి డాక్టర్ వై.మణికంఠం తొలి ప్రతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పుస్వామి శెట్టి మంచితనం, నిరాడంబరత గురించి, పుస్తకాల్లోని సారాంశం గురించి వివరించారు. కుప్పుస్వామి శెట్టితో తన అనుబంధాన్ని నెమరువేసుకుంటూ తాను ఆయన నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నట్లు రచయిత డాక్టర్ ఆర్.నటరాజన్ వివరించారు. ఈ కార్యక్రమానికి పీఎం హేమవతి, డాక్టర్ వై.మణికంఠన్, ఎస్.రవిచంద్రన్, ఎన్‌వీ సుబ్బారావు, ప్రముఖాంధ్ర సంపాదకులు గోటేటి వెంకటేశ్వరరావు, దర్శక నటుడు పార్తీబన్, ఇలయా కట్టబొమ్మన్ తదితరులతో పాటు పలువురు తమిళ, తెలుగు ప్రముఖులు పాల్గొని కుప్పుస్వామిని సన్మానించారు.



రష్యన్ల రాహుకేతు పూజలు

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సుమారు 40మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని తెలిపారు. తాము స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సారె ట్రయల్ రన్

తిరుచానూరులో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న ని పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆదివారం శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు (వచ్చే నెల 6న) పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారు సారె పంపడం ఆనవాయితీ. ఈ క్రమంలో ట్రయల్ రన్‌గా ఆదివారం ఉదయం డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఇతర టీటీడీ అధికారులు, సిబ్బంది కలిసి ఏనుగులపై అమ్మవారి నమూనా సారె తెచ్చారు. కోమలమ్మ సత్రం నుంచి రాములవారి గుడి, గాంధీరోడ్డు మీదుగా గోవిందరాజస్వామి ఆలయం, గ్రూప్‌థియేటర్స్, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్, లక్ష్మీపురం, పద్మావతిపురం మీదుగా తిరుచానూరు ఆలయం వరకు తీసుకువచ్చారు. సూపరింటెండెంట్లు రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





ఆహ్లాదంగా పర్యాటకులు

సీమ సిగలో మరో బీచ్

శ్రీనివాససత్రం

అభివృద్ధి పరిస్తే గొప్ప పర్యాటక క్షేత్రం అవుతుంది



చెన్నై నుంచి కృష్ణపట్నంపోర్టుకు వెళ్తున్న స్టీమర్

జిల్లాల విభజనతో రాయలసీమకు సముద్రం కానుకగా వచ్చింది. ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశంగా కోట సమీపంలోని తూపిలిపాళెం బీచ్ గుర్తింపు పొందింది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అయితే రాష్ట్ర పర్యాటక శాఖ కన్ను పడని మరొక అందమైన బీచ్ కూడా కోట మండలంలో ఉంది. మంచి రోడ్డు వేసి, వసతులు కల్పిస్తే ఈ రెండు బీచ్‌లూ ఆదాయవనరులుగా మారుతాయి.

- కోట, ఆంధ్రజ్యోతి

ఎండకి మెరిసే ఇసుక మీదకి ఉరకలెత్తే అలలు.. సముద్రంలో సాగిపోయే పడవలు.. దూరంగా మసక దృశ్యంలా కృష్ణపట్నం ఓడరేవు.. పోర్టు దిశగా వెళ్లే స్టీమర్లు.. తీరంలో సవకతోపుల్లో చెట్ల కింద సేదదీరే పడవలు.. జీడిమామిడి చెట్లు.. మాల్దీవుల వర్ణన కాదు ఇది. మన తిరుపతి జిల్లాలో ప్రసిద్ధికెక్కని ఒక బీచ్ అందాలు ఇవి. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరం సౌందర్యం వర్ణనాతీతం. పర్యాటక ప్రదేశంగా దీనిని గుర్తించి అభివృద్ధి పరచలేదు కానీ, సమీప ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో వచ్చి ఆహ్లాదంగా గడుపుతుంటారు. లోతు తక్కువగా ఉండడంతో అలలతో సయ్యాటలాడుతుంటారు. నీలపు రంగు పులుముకున్న సముద్రమూ, ఆకాశమూ నేపథ్యంగా ఫోటో షూట్‌లు చేసుకుంటూ ఉంటారు. ఇప్పటిదాకా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా ఇక్కడ జరగలేదంటే ఇదెంత ప్రమాదరహితమైన ప్రదేశమో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పరిస్తే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా శ్రీనివాస సత్రం బీచ్ రూపు మారుతుంది.

శ్రీనివాససత్రానికి ఇలా వెళ్లొచ్చు..

గూడూరు నుంచి కోట మీదుగా వెళ్లాలి. గూడూరు నుంచి కోటకు 26 కిలోమీటర్లు. అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో శ్రీనివాససత్రం ఉంటుంది. ఇక్కడిదాకా తారు రోడ్డు ఉంది. ఇక్కడి నుంచీ 500 మీటర్ల దూరంలో సముద్ర తీరం ఉంటుంది. సొంత వాహనాల్లో గానీ, కోట నుంచి ఆటోల్లోగానీ వెళ్లాలి. శ్రీనివాససత్రంలో టిఫిన్, భోజనం వంటివి లభించవు. ఇక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని గోవిందపల్లిలో మాత్రం హోటళ్లు ఉంటాయి.



శ్రీనివాససత్రం నుంచి కనిపిస్తున్న కృష్ణపట్నం పోర్టు

సముద్రంలో రెండు దీవులు

2022లో కేంద్ర పర్యాటక శాఖ బృందం ఈ బీచ్‌ను పరిశీలించింది. అభివృద్ధి పరచడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. గోవిందపల్లిపాళెం-శ్రీనివాససత్రం మధ్య ప్రాంతంలో తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో రెండు దీవులు ఉండడాన్ని గుర్తించింది. దిబ్బల్లా ఉన్న వీటిలో చెట్లు కూడా ఉన్నాయి. వీటిని అభివృద్ధి పరిస్తే పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే తీరం వెంబడి చిన్న చిన్న పిక్‌నిక్ పాయింట్‌లు ఏర్పాటు చేయచ్చని భావించింది. అయితే ఆ నివేదిక అతీగతీ ఏమైందో మాత్రం తెలియదు.

క్రైం కార్నర్

22కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ సుబ్బరామిరెడ్డి కథనం మేరకు ముందస్తు సమాచారంతో ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన సామిరెడ్డి బేబీ పరిసరాల్లో యానాదుల నుంచి గంజాయి సేకరించి తిరుపతిలో విక్రయించేది. తిరుపతికి చెందిన రమ్య ఇందుకు సహకరించేది. ఈక్రమంలో సామిరెడ్డి బేబీ విశాఖ నుంచి గంజాయి తీసుకువచ్చాడు. దానిని కొనుగోలు చేసేందుకు తిరుచానూరుకు చెందిన నరసింహ, కార్తీక్, ప్రవీణ్, మణికంఠ, అబ్దుల్ కయాం జుబేర్(ఉత్తరప్రదేశ్)లు ఎం.కొంగువారిపల్లి దగ్గర జగనన్న కాలనీకి వచ్చారు. అదే సమయంలో రెవెన్యూ అధికారుల సహకారంలో పోలీసులు, దాడులు చేశారు. ఆరుగురిని అరెస్టు చేశారు. రమ్య పరారైయింది. గంజాయితోపాటు బైక్, కొంతనగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.3.82 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించారు. మీడియా సమావేశంలో ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మయ్యది సుపారీ హత్య: డీఎస్పీ

- పది మంది నిందితుల అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

వెంకటగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో ఈ నెల 5వ తేదీ జరిగిన అల్లం లక్ష్మయ్య హత్య కేసును పోలీసులు చేదించారు. లక్ష్మయ్యను ప్రత్యర్థులు సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో హత్యకు దారితీసిన వివరాలను వెల్లడించారు. జయంపు గ్రామానికి చెందిన అల్లం లక్ష్మయ్యకు అదే గ్రామానికి చెందిన శివారెడ్డి కల్యాణ రెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ నెల 2వ తేదీన రెండు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకొంది. ఇరువర్గాలకు గాయలవడంతో బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మయ్యను హత మార్చాలని కల్యాణ రెడ్డి పథకం రచించారు. వ్యాపారం చేసుకొంటూ తిరుపతిలో వున్న కల్యాణ రెడ్డి అన్నడే కొందరు మిత్రులను కలిసి లక్ష్మయ్య హత్య చేసేందుకు రూ.లక్ష ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొన్నాడు. ఈనెల 5వ తేదీన తిరుపతి నుంచి టెంపోలో 10మంది జయంపు గ్రామానికి చేరుకొన్నారు. లక్ష్మయ్య ఇంటికి వెళ్లి తాము పోలీసులు అని చెప్పారు. విచారణ కోసం రావాలంటూ లక్ష్మయ్యను వ్యాన్‌లోకి ఎక్కించుకొని తీసుకెళ్లారు. ఇదంతా గమనించిన స్థానికులు వెంకటగిరిలో ఉన్న లక్ష్మయ్య అల్లుడికి ఫోన్ చేసి మీ మామను పోలీసు యూనిఫాంలో వచ్చిన కొందరు తీసుకెళ్లారని, అయితే వారు పోలీసులు కాదేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో లక్ష్మయ్య అల్లుడు తన మామని ఎవరో కిడ్నాప్ చేశారని బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు 6వ తేదీ తెల్లవారుజామున హస్తకావేరి పంట పొలాల్లో లక్ష్మయ్య రక్తగాయాలతో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. హంతకులు తాము వచ్చిన టెంపోను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆదివారం వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో గూడూరు వెళ్లే ట్రైన్ కోసం నిరీక్షిస్తున్న 10 మంది అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా లక్ష్మయ్య హత్య విషయం బయటపడింది. నిందితులందరినీ అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసును చేదించిన వెంకటగిరి సీఐ రమణ, బాలాయపల్లి ఎస్ఐ గోపిని అభినందించారు.



మృతి చెందిన లోకనాథం

అప్పుల బాధ తాళలేక..

బుచ్చినాయుడుకండ్రిగ, నంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట సాగుకు అప్పుచేసి పెట్టుబడి పెట్టారు. ఈసారైనా ఆదాయం రాకపోతుందా అని సోదరుడి పొలంతో సహా ఐదు ఎకరాల్లో సేద్యం చేస్తూనే వచ్చారు. ఏటా పెరిగిన వడ్డీతో అప్పు రూ.13 లక్షలకు చేరుకుంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం రాత్రి బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్టవరత్తూరుకు చెందిన రైతు లోకనాథం పురుగుల మందు తాగారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేశారు.



కుటుంబ సభ్యులతో భానుప్రకాష్‌రెడ్డికి ఘన సన్మానం

టీటీడీ సభ్యుడు భానుకు ఘన సన్మానం

- కృషికి తగిన పదవి అన్న వక్తలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డికి ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని మహతిలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయన కృషికి తగిన గుర్తింపే.. ఈ పదవి అని పలువురు పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ఎవరూ టీటీడీ పరిపాలనలో జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబు టీడీఎల్పీ సమావేశంలో ఆదేశించిన మేరకే తాము ఉంటున్నామన్నారు. అయితే, పద్మావతి అమ్మవారు, శ్రీవారిమెట్టు, శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధికి టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి సహకరించాలని కోరారు. టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి రెండోసారి నియమితులు కావడం ఆయన శ్రమకు భగవంతుడు ఇచ్చిన ప్రతిఫలమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి అన్నారు. కలియుగ దైవం శ్రీవారి ఆలయాన్ని ఎవరూ పరిపాలించలేరని.. అందుకే టీటీడీ పాలకమండలిని ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని మాజీ జేఈవో శ్రీనివాసరాజు సూచించారు. తిరుపతిలోని టీటీడీ విద్య వైద్య సంస్థల్లో స్థానికులకు ఉచిత విద్య, వైద్యం అందించేలా భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. టీటీడీపట్ల చిన్న అపచారం, దుష్ప్రచారం జరిగినా పార్టీలకు అతీతంగా ఏకం కావాలని తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుమల స్థానికులు ఎంతో త్యాగం చేశారని, వారికి న్యాయం చేసేందుకు భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీవారి అనుగ్రహం, తన తల్లిదండ్రులు, కుటుంబం చేసుకున్న పుణ్యఫలంతోనే తాను రెండోసారి సభ్యుడిని కాగలిగానంటూ భానుప్రకాష్‌రెడ్డి భావోద్వేగం చెందారు. ఇది హోదా కాదు.. బాధ్యతన్నారు. శ్రీవారిపట్ల, సనాతన ధర్మం పట్ల ఎటువంటి అపచారం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. మొదటి సమావేశంలోనే పాలక మండలి స్థానంలో ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని ప్రతిపాదిస్తానన్నారు. స్విమ్స్‌ను మరింతగా అభివృద్ధి చేయడమే తన తొలి ప్రాధాన్యంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని అపశ్రుతులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ క్రమంలోనే తానూ శ్రీవారికి, భక్తులకు సేవ చేస్తానని చెప్పారు. తనను సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తన పార్టీ అధినాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు అనంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, పొన్నగంటి భాస్కర్, జీవన్‌రాయల్, క్రెడాయ్ అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాసరాజు



ఆర్మీలో ఎంపిక కోసం పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
- కడపలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో ఆదివారం వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్ట్‌కు 13 జిల్లాల నుంచి అభ్యర్థులు పాల్గొననున్నారు. మొదటి దశ పరుగును జేసీ అదితిసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఈ ఎంపికలో విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ర్యాలీకి కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల,అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనేది ఆర్మీ అధికారులు ముందుగానే కాల్ లెటర్లు పంపించారు.





ఆర్మీ ఎంపిక కోసం వివిధ సామర్థ్య పరీక్షలు

ముద్దుగారే యశోద

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన



తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం అలరించింది. శివగౌరి నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. భావిష, ఆశ్రిత, కీర్తన, ధామిని, షన్విక, హనన్య, శ్రీనిధి, సహస్ర, ప్రియ, రోషిణి తదితరులు నాగేంద్ర హరాయ, సౌభాగ్య లక్ష్మి, వక్రతుండ మహాకాయ, మహాగణపతిం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.79 కోట్లు

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,558 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,675 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.